క్రీడా రత్నాలు

- పారిశ్రామిక ప్రాంత క్రీడాకారులకు జాతీయ,అంతర్జాతీయ పతకాలు
- స్ఫూర్తిగా నిలుస్తున్న క్రీడాకారులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. ప్రతిభ చూపిన వారిలో 12 ఏళ్ల బాలికతో పాటు 69 ఏళ్ల వెటరన్ క్రీడాకారుడు ఉండడం విశేషం. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కథనం.

60 ఏళ్లు దాటినా.. పరుగులో మేటి

జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ ప్రాంతానికి చెందిన ఆకుల కనకరాజుకు 69 ఏళ్లు. ఇతను విశాఖ సెంట్రల్ జైల్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందాడు. తన 13వ ఏట నుంచే వివిధ క్రీడల్లో కనకరాజు ప్రతిభ చూపేవాడు. బాక్సింగ్,వుట్‌బాల్,ఖోఖో,కబడ్డీ, హాకీలో మంచి ప్రావీణ్యం ఉంది. 1996లో నేషనల్ స్థాయి 100, 200, 300 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించాడు. 2016లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్‌లో 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన నేషనల్ అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.


సాధించిన బంగారు పతకాలతో కనకరాజు

బాక్సింగ్‌లో రోషి ప్రతిభ

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల రోషి జూనియర్ స్థాయి బాక్సింగ్‌లో ప్రతిభ చూపుతోంది.రఘు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ నుంచి సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీ (2021)ల్లో సిల్వర్ మెడల్ సాధించింది. నగరంలో 2022లో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్,ఇటీవల స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది.


బంగారు పతకం సాధించిన రోషి

బాక్సింగ్‌లో రేష్మాయాదవ్‌కు పతకాల పంట

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ రేష్మాయాదవ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. రేష్మాయాదవ్‌కు బాక్సింగ్ అంటే మక్కువ. దీంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షణ తీసుకుని జిల్లా ,రాష్ట్ర స్థాయి,జాతీయ స్థాయి మహిళా విభాగ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. ఇటీవల పూణేలో జరిగిన జాతీయ మహిళా బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సొంతం చేసుకుంది. ఇంత వరకు రేష్మాయాదవ్ ఐదు గోల్డు మెడల్స్,నాలుగు సిల్వర్ మెడల్స్,6 బ్రాంజ్ మెడల్స్ వివిధ పోటీల్లో సాధించింది.


బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రేష్మాయాదవ్

రేస్ వాకింగ్‌లో కింగ్ అన్సర్‌వల్లీ

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన అన్సర్ వల్లీ స్థానిక ఏపీఈపీడీసీఎల్ (శ్రీహరిపురం సబ్‌స్టేషన్)లో ఏఎల్ఎం ఉద్యోగి. పాఠశాల దశ నుంచి కబడ్డీ,రన్నింగ్ ఇతర పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపేవాడు. స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (కబడ్డీ)లో ప్రతిభ చూపి ఆ జట్టుకు ప్రథమ స్థానం రావడంలో కీలక భూమిక పోషించాడు. అలాగే ఎన్టీపీసీ నిర్వహించిన జిల్లా స్థాయి రన్నింగ్, డిస్క్ త్రో పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. సాఫ్ట్ బాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ 5 కేఎం రేస్ వాకింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు.


5 కేఎం రేస్ వాకింగ్‌లో సత్తాచాటి పతకం అందుకుంటున్న అన్సర్‌వల్లీ (ఫైల్)

తెలుగువాడు గర్వపడే స్థాయికి తెలుగు సినిమా

గోపాలపట్నం: తెలుగు వాడు గర్వపడేలా తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి చేరిందని గోపాలపట్నం కళా సేవా పీఠం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు అన్నారు. తెలుగు సినిమాలకు జాతీయ అవార్డులు వచ్చిన సందర్భంగా గోపాలపట్నం కళా సేవా పీఠం సంఘం కార్యాలయంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాలకు జాతీయ అవార్డులు రావడం గొప్ప విషయమన్నారు. అంతకు ముందు ఆస్కార్ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. కళా సేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు మాట్లాడుతూ 68 ఏళ్ల తర్వాత అల్లు అర్జున్ రూపంలో జాతీయ కథానాయకుడి అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గంపల అప్పారావు, ప్రధాన కార్యదర్శి డీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నందవరపు సోములు

జీవీఎంసీ పాఠశాలలో డిజిటల్ బోధన

మల్కాపురం: సర్కార్ బడిలో కార్పొరేట్ స్థాయి బోధన అందిస్తున్నారు. ఒకనాడు ప్రభుత్వ పాఠశాలల్లో బ్లాక్‌బోర్డులు సరిగ్గా ఉండేవి కావు. నేడు అదే తరగతి గదుల్లో డిజిటల్ బోధన అందిస్తున్నారు. 58వ వార్డు శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం డిజిటల్ బోధన ప్రారంభించారు. ఇలాంటి బోధన ఉండడంతో ఎంతో సౌకర్యవంతంగా చదువుకోగలుగుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.


డిజిటల్ బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు అభినందనీయం


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను సోమవారం నవరత్న ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మళ్ల చిన్నఅప్పారావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టడం అభినందనీయమన్నారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీశెట్టి రవీంద్ర, మారిశెట్టి ప్రసన్న, హుస్సేన్, వేణు, శశి, శ్రీనుపాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఉందన్నారు. ఆసక్తి గల అర్హత అభ్యర్థులు kvic onine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతో పాటే నైట్ అలవెన్స్

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి,జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుత్ పోరాట అమర వీరులకు ఘన నివాళి

గోపాలపట్నం: విద్యుత్ పోరాటంలో అమరులైన సీఐటీయూ నాయకులకు సోమవారం సీఐటీయూ గోపాలపట్నం శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ మేరకు కార్యాలయంలో నిర్వహించిన సంస్మరణ సభలో అమరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు ఆర్. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ మెప్పు కోసం పెద్ద ఎత్తున విద్యుత్ చార్జీలు పెంచిందని విమర్శించారు. భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని హైదరాబాద్‌లో శాంతియుత పోరాటం చేస్తే సీపీఎం, సీఐటీయూ నాయకులపై పోలీసులతో పైశాచికంగా అప్పటి సీఎం చంద్రబాబు కాల్పులు జరిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి అమరులయ్యారని గుర్తు చేశారు.

నరసింహనగర్‌లో సమస్యలపై వినతి


భాస్కరరావుకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును ఆయన ఇంటి వద్ద నరసింహనగర్ సొసైటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ ప్రాంతంలో డాక్టర్ సూర్యనారాయణ వీధి, శంకర సినిమాహాలు వెనుక వీధుల్లో రహదారులు మంచినీటి పైప్‌లైన్ పనులతో అధ్వానంగా మారాయని వివరించారు. కాల్వలు కూడా పాడయ్యాయని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.